

రామాయంపేటలోని ఓ పడావు భూమిలో నిండా నల్లమట్టిని పోసుకున్న రైతు

# నల్లమట్టి భూమికి పుష్టి

**నల్లమట్టితో భూసారం పెరుగుతుందంటున్న అధికారులు**

- రసాయనాలు లేకున్నా పంట చేతికి..
- వేసవి కాలం ఉపాధి పనులతో రైతులకు లాభాలు
- ట్రాక్టర్లతో చెరువు మట్టిని తీసుకెళ్తున్న అన్నదాతలు



దామరచెర్వు చెరువు పూడిక మట్టిని తవ్వుతున్న ఉపాధి కూలీలు



రాయిలాపూర్‌లో జేసీబీతో ట్రాక్టర్లలో పోస్తున్న నల్లమట్టి



చేనులో నల్లమట్టిని కుప్పలుగా పోసుకున్న రైతు

రామాయంపేట, మే 15: చెరువు మట్టి అంటే చాలు రైతులు సిరులు కురిపిస్తుందని నమ్ముతారు. చెరువులో నల్లమట్టి తీస్తున్నారంటే చాలు రైతులు పరుగులు పెడుతారు. ఉపాధి పనుల వద్దకు వెళ్లి వంతుల వారీగా ట్రాక్టర్లకు అద్దెలు చెల్లించి మరీ తీసుకెళ్లి తమ పొలాల్లోకి నల్లమట్టిని తరలిస్తుంటారు. కొంతమంది రైతులు తమ పంట చేలల్లో కనీసం 12 అంగులాల ఎత్తున మట్టి పోసుకుంటారు. ఈ నల్లమట్టిని చేలలో పోసుకుంటే రైతులకు రసాయనిక ఎరువులు ఎక్కువగా వాడే బాధ తప్పుతుంది. దీంతోపాటు భూసారం కూడా పెరుగుతుంది. పొలాల్లో చెరువుల మట్టి వేయడంతో పంట దిగుబడి పెరిగి అన్నదాతలు ఎక్కువ లాభాలు ఆర్జిస్తారు. రామాయంపేట వ్యవసాయ శాఖ డివిజన్‌లోని రామాయంపేట, నిజాంపేట, నార్సింగి, చేగుంట మండలాల వ్యాప్తంగా ఎక్కడ ఏ చెరువులో చూసినా ఉపాధి పనులు నడుస్తున్నాయి. ఉపాధి పనులు మొదలవడంతోనే రైతులు చెరువుల వద్దకు వెళ్లి వంతులవారీగా మట్టిని తరలిస్తున్నారు. ప్రస్తుతం అన్ని మండలాల్లోని పల్లెలు. గ్రామాల్లోనే చెరువుల పూడికల్లో నల్లమట్టి లభిస్తున్నది. దీంతో నల్లమట్టి ఎక్కువగా పంటలకు సిరులు కురిపిస్తు ఫలితాలు ఇస్తున్నది.

### నల్లమట్టిని పోటీ పడి తీసుకెళ్తారు



నల్లమట్టిలో ఎక్కువ భూసారం కలిగి ఉంటుంది. అందుకోసం రైతులు ఉపాధి పనులు జరిగే చోటకు వచ్చి నల్లమట్టి ఉంటే ఇక అక్కడి నుంచి కదలరు. కచ్చితంగా రైతులు వారి పంట పొలాలకు ఈ మట్టిని ట్రాక్టర్లకు అద్దెలు చెల్లించి మరీ తీసుకెళ్తారు. దీంతో భూమిలో భూసారం పెరుగుతుంది. – శంకర్, ఏపీవో, రామాయంపేట

### నల్లమట్టితో భూసారం పెరుగుతుంది



నల్లమట్టితో పొలాల్లో భూసారం పెరిగి, పంట దిగుబడి వస్తుంది. అందుకు ఎక్కువ మంది రైతులు చెరువుల్లో పూడిక తీసినప్పుడు నల్లమట్టి కావాలని తీసుకెళ్తారు. ఇది ఎక్కువ శాతం పడావు భూముల్లో వేస్తుంటారు. ఎందుకంటే పడావు భూముల్లో భూసారం తక్కువగా ఉండి పంటలు పండవు. పంటలు పుష్టిగా పండాలంటే భూసారం ఎక్కువగా ఉండే నల్లమట్టినే వేయాలి.

– రాజ్‌నారాయణ, వ్యవసాయ అధికారి, రామాయంపేట

### కొనసాగుతున్న ఉపాధి పనులు

నిజాంపేట, మే 15: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న స్థానిక చెరువులు, కుంటల్లో ఉపాధి పనులు కొనసాగుతున్నాయి. బుధవారం నిజాంపేటలోని విశ్వపతి కుంటలో ఉపాధి పనులు జరుగుతున్నాయి. కూలీలకు పని కల్పించడమే తమ లక్ష్యమని ఫీల్డ్ అసిస్టెంట్ తిరుమల్ తెలిపారు.



నిజాంపేటలోని విశ్వపతి కుంటలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు



కుప్పగా పోసిన నల్లమట్టి

## బాలశక్తి పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలి

**- మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి బ్రహ్మాజీ**

మెదక్ రూరల్, మే 15: మహిళా, శిశు సంక్షేమ శాఖ జిల్లా ఆధ్వర్యంలో రాష్ట్రీయ పురస్కారాల కోసం అర్హులైన చిన్నారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి బ్రహ్మాజీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన చిన్నారులకు బాలశక్తి పురస్కార్ అవార్డులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దీనికి 06 నుంచి 18 ఏండ్లలోపు బాలబాలికలు ఆవిష్కరణ, సృజనాత్మకత, మంచి అభ్యాస వాతావారణం, సాంస్కృతిక కళలు, సాహసం, క్రీడాలు, సామాజిక సేవ, శాస్త్ర సాంకేతిక ఇతర రంగాల్లో ప్రతిభ చూపిన వారు జూలై 30 లోపు https//awards.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేస్తుకోవాలని పేర్కొన్నారు.

## దుర్గాబాయి దేశ్‌ముఖ్ పాలిటెక్నిక్ కళాశాలలో దరఖాస్తుల స్వీకరణ

**జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి బ్రహ్మాజీ**



మెదక్‌రూరల్, మే 15: దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమా విద్య 2024–25కు అర్హులైన అనాధ బాలికలు, పేదరికంలో అక్రమ రవాణాకు గురి అయిన, సంరక్షణ కేంద్రం, మహిళా సంస్థలోని బాలికల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మహిళా శిశు సంక్షేమశాఖఅధికారి బ్రహ్మాజీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరికి డిప్లమా ఇన్ సివిల్ ఇంజినీరింగ్, 2 డిప్లమా ఇన్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్, 3. డిప్లమా ఇన్ ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, ఒక్కో విభాగానికి 60 సీట్లు ఉన్నాయి. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు బాలరక్షన్‌భవన్, జిల్లా మహిళా శిశు దివ్యాంగులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ కలెక్టర్ కార్యాలయం మెదక్‌లో ఉదయం 10:30 నుండి సాయంత్రం 4గంటలవరకు సంప్రదించగలరన్నారు. ఈ నెల 18 తేదీ వరకు ఈ అవకాశాన్ని అర్హులైన బాలికలు స్వధినియోగం చేసుకోవాలని కోరారు.

## బాధిత మహిళలకు అండగా సఖీ కేంద్రం



రేణుక, సఖీ కేంద్ర నిర్వాహకులు

మెదక్ రూరల్ , మే15: బాధిత మహిళలకు మేమున్నామంటూ అం డగా సఖీ కేంద్రం నిలబడుతున్నదని, వారి జీవితాలకు సఖీ కేంద్రం భరోసా కల్పిస్తున్నదని ఆ కేంద్ర ని ర్వాహకురాలు రేణుక అన్నారు. బుధవారం ఆమె విలేకరులతో మా ట్లాడుతూ సఖీ కేంద్రంతో బాధితులకు తాత్కాలిక వసతి కల్పించి, ఉచి త న్యాయ సహాయం, వైద్యసేవలు, పోలీస్ సహాయం, కౌన్సెలింగ్ అందిస్తున్నట్లు తెలిపారు. గృహ హింస, వరకట్న వేధింపులు, ఆడపిల్లల విక్రయం, అక్రమ రవాణా ఆరికట్టడం, ఇతర వాటిపై 24గంటలు పని చేస్తున్నట్లు తెలిపారు. ఆపదలో ఉన్న వారు టోల్ ఫ్రీ నెంబర్ 181 లేదా మెదక్ సఖీ కేంద్రం 08452–295181, 9346146580 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## భార్యపై దాడిచేసిన భర్తకు రెండేండ్లు జైలు శిక్ష

చేగుంట, మే 15: భార్యపై కత్తితో దాడి చేసి హత్యాయత్నం చేసిన భర్తకు రెండేండ్లు కఠిన కారాగార జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానాను మెదక్ కోర్టు విధించినట్లు చేగుంట ఎస్సై బాలరాజు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. చేగుంట మండలం వడియారం గ్రామానికి చెందిన మర్రికింది శ్యామల భర్త నాగేశ్ 2023 ఆగస్టులో చంపుతానని బెదిరించి కత్తితో హత్యాయత్నం చేశాడు. దీంతో శ్యామలకు తీవ్ర రక్త గాయాలు అయ్యాయి. విడిపించడానికి వచ్చిన వారి బంధువులను కట్టెతో కొట్టాడు. దీంతో చేగుంట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై కేసు నమోదు చేశారు. రామాయంపేట సీఐ పరిశోధన చేసి చార్జ్‌షీట్ దాఖలు చేసి, సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. నగేశ్‌పై నేరం రుజువు కావడంతో బుధవారం రెండేండ్లు కఠిన కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ మెదక్ అడిషనల్ డిస్ట్రిక్ట్ న్యాయమూర్తి జితేందర్ తీర్పు చెప్పినట్లు ఎస్సై బాలరాజు తెలిపారు.

# ఓటేయరు.. ఎలా ప్రశ్నిస్తారు?

- మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఓటేయ్యని వారు 4,55,316 మంది
- 2019 కంటే ఈసారి 3.38 శాతం పెరిగిన పోలింగ్
- ఈ ఎన్నికల్లో పెరిగిన యువత భాగస్వామ్యం

**గడప దాటని ఓటరు మహాశయులారా..** ప్రజాస్వామ్యానికి మీరిచ్చే గౌరవం ఇదేనా? మీ అమూల్యమైన ఓటును వినియోగించుకోలేక పోవడంతో మీరిచ్చే సందేశం ఏమిటి? నాయకులు నచ్చలేదా.. లేదంటే ఓటేయడమంటే బద్ధకమా? ఒక్క మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలోనే 4,55,316 మంది ఓటెయ్యలేదంటే ఇది చాలా దురదృష్టకరమైన విషయం. ఓటు వజ్రాయుధం అని ప్రచారం చేసినా మీ స్పందన కరువయ్యింది. ఓటే వెయ్యని మీకు రేపు ప్రశ్నించే హక్కు ఉంటుందా? పండుటాకులు, దివ్యాంగులు పడిలేస్తూ ఓటెయ్యడానికి పోటెత్తుతుంటే మీకేమైంది. ఎందుకింత నిర్లక్ష్యం. మీ నిర్లక్ష్యం ఖరీదు అందరికీ శాపమవుతుంది. దయచేసి ఇప్పటికైనా ఆలోచించండి ఓటేయడానికి బద్ధకించిన ఓటరు మహాశయులారా?

మెదక్, మే 15 (నమస్తే తెలంగాణ): మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో నియోజకవర్గాల్లో 4,55,316 మంది ఓటేయలేదు. మొత్తం ఏడు నియోజకవర్గాల్లో 18,28,210 మంది ఓటర్లలో పురుషులు 9,02,110 మంది, 9,25,891 మంది మహిళలు, 209 మంది ఇతరులు ఉన్నారు. సిద్దిపేట సెగ్మెంట్‌లో 2,37,591 ఓటర్లలో 62,622 మంది, మెదక్ సెగ్మెంట్ 2,18,735 మందికి 43,326 మంది, నర్సాపూర్ సెగ్మెంట్ 2,27,088 మందికి 35,773 మంది, సంగారెడ్డి సెగ్మెంట్ 2,49,775 మందికి 69,974 మంది ఓటేయలేదు. పటాన్‌చెరు సెగ్మెంట్‌లో 4,13,983 మంది ఓటర్లకు 1,53,142 మంది, దుబ్బాక సెగ్మెంట్ 2,00,125 మందికి 35,173 మంది, గజ్వేల్ సెగ్మెంట్ 2,80,913 మందికి 55,306 మంది ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. అయితే వీరిలో అధికంగా పట్టణ ప్రాంత ఓటర్లే ఉండడం గమనార్హం.

### అసెంబ్లీతో పోల్చితే 4.59 శాతం ఓటింగ్ తగ్గింది

గతేడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 79.68 శాతం పోలింగ్ నమోదు కాగా, పార్లమెంట్ ఎన్నికల్లో 75.09 శాతం నమోదైంది. అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే 4.59 శాతం పోలింగ్ తగ్గింది. అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో 17.89 లక్షల మంది ఓటర్లకు 14.25 లక్షల మంది ఓటేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో 18.28 లక్షల మందికి 13.72 లక్షల మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

| నియోజకవర్గం | ఓట్లు | పోలైనవి | ఓటేయనివారు | శాతం |
|---|---|---|---|---|
| సిద్దిపేట | 2,37,591 | 1,74,969 | 62,622 | 26.36 |
| మెదక్ | 2,18,735 | 1,75,409 | 43,326 | 19.81 |
| నర్సాపూర్ | 2,27,088 | 1,91,315 | 35,773 | 15.75 |
| సంగారెడ్డి | 2,49,775 | 1,79,801 | 69,974 | 28.01 |
| పటాన్‌చెరు | 4,13,983 | 2,60,841 | 1,53,142 | 36.99 |
| దుబ్బాక | 2,00,125 | 1,64,952 | 35,173 | 17.58 |
| గజ్వేల్ | 2,80,913 | 2,25,607 | 55,306 | 24.91 |

## లాఠీచార్జ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



నర్సాపూర్‌లో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

నర్సాపూర్, మే15: ఉపాధ్యాయులపై లాఠీ చార్జ్ చేయించిన నారాయణఖేడ్ ఆర్డీవో, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై చరణ్‌రెడ్డి, పోలీసులపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం నర్సాపూర్‌లోని టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నిబంధనల ప్రకారం టీఏ, డీఏ చెల్లించాలన్నందుకు పోలీసులు బలప్రయోగం చేయడం అమానుషమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఒకే రకమైన రెమ్యునరేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.691 ప్రకారం పీవో, ఏపీవోలకు రోజుకు రూ.600, ఓపీవోలకు రూ.400 అందజేయాలన్నారు. రెమ్యూనరేషన్ చెల్లింపులో తేడా ఎందుకని ప్రశ్నించిన టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి.లక్ష్మారెడ్డి, జిల్లా నాయకులు సాయితేజ, కేశవరావు, ప్రభాకర్, సుధాకర్, అనురాధ, ఇతర ఉపాధ్యాయులు, ఉద్యోగులపై ఆర్డీవో ఆదేశాల మేరకు పోలీసులు విచక్షణారహితంగా లాఠీచార్జ్ చేసి ఉపాధ్యాయులను గాయపర్చారన్నారు. నిబంధనలను పాటించకుండా ఉపాధ్యాయులపై దౌర్జన్యం చేసిన ఆర్డీవో, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై చరణ్‌రెడ్డి, పోలీస్‌లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ నర్సాపూర్ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.రవి, నాగుల్‌మీరా పాల్గొన్నారు.

### లాఠీ చార్జి చేయడం హేయమైన చర్య: తపస్

చేగుంట, మే 15: ఉపాధ్యాయులపై పోలీసులు లాఠీ చార్జి చేయడం అత్యంత హేయమైన చర్య అని మెదక్ జిల్లా తపస్ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్ తెలిపారు. బుధవారం చేగుంటలో ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ ఎన్నికల్లో పాల్గొన్న ఉద్యోగులకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం రెమ్యునరేషన్ చెల్లించాలని అడిగినందుకు సంగారెడ్డి జిల్లా నారాయణ్‌ఖేడ్‌లో సోమవారం రాత్రి ఎన్నికల సిబ్బందిపై లాఠీచార్జి చేయడం అత్యంత దురదృష్టకరమన్నారు. బాధ్యులు సురేందర్, రావుల వెంకటేశ్, సంతోష్‌కుమార్, ప్రవీణ్, పట్లూరి యాదగిరి తదితరులున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు**

ఓం శక్తి గ్రూప్స్ మీకు మీ స్వగ్రామంలో ఉండి ఉద్యోగం పొందే అవకాశాన్ని కల్పిస్తుంది.
Open Positions: మండల్ డెవలప్మెంట్ ఆఫీసర్స్, విలేజ్ డెవలప్మెంట్ ఎగ్జిక్యూటివ్.
విద్యార్హత: (10th to any Degree)
Salaries, PF, ESI + Incentives
Send resume to: contact@omshakthigroups.com
ముత్త యాదగిరి కురుమ
సెల్: 9703210414, 9949953937, 040-49955978

**RECRUITMENT**

★Pen, Pencil Company, Educated, Unemployed Girls/Boys, Male/Female, House Wife Earn 24500-64500 Packing Work at Home 9034548725, 9728230253

NT-3277-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## బాల ప్రతిభావంతులకు పురస్కారాల ప్రదానం



పురస్కార గ్రహీతలతో విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్

ముషీరాబాద్, మే 15 : రసమయి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో బాల ప్రతిభావంతులకు పురస్కారాలు ప్రదానం చేశారు. విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి నృత్యం, సంగీతం, చిత్రలేఖనం, ఛాయాగ్రహణంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన బాలలకు పురస్కారాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో నాట్య గురువు ఎస్.పి. భారతి, రసమయి సాంస్కృతిక సంస్థ . అధ్యక్షుడు ఎం.కె.రాము, ములుగు శ్రీనివాసులు పాల్గొన్నారు.

## జూన్ 5లోగా పాఠశాలల పనులు పూర్తి చేయాలి

**- డీఈఓ రాధాకిషన్**



పాఠశాలలను సందర్శించిన్న డీఈఓ రాధాకిషన్

కౌడిపల్లి/శివ్వంపేట, మే 15 : కౌడిపల్లి మండలంలో మొత్తం 38 పాఠశాలలు ఎంపికయ్యాయని, అన్ని పాఠశాల లు కూడా జూన్ 5వ తేదీలోగా మౌలిక సదుపాయా లు కల్పించాలని డీఈఓ రాధాకిషన్ తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనుల సందర్శనలో భాగం గా బుధవారం డీఈవో కౌడిపల్లి మండలంలోని యూపీఎస్ సదాశివపల్లి, ఎంపీపీఎస్ బూరుగడ్డ పాఠశాలలను సందర్శించి పలు సూచనలు చేశారు. డ్రింకింగ్ వాటర్, మైనర్ రిపేర్లు, ఎలక్ట్రిసిటీ ఫిట్టింగ్, టాయిలెట్స్ రిపేర్ పూర్తి చేయాలని ఆదేశించారు. పనులు చేయడానికి ఇప్పటివరకు అన్ని పాఠశాలలకు 25% డబ్బులు అడ్వాన్సుగా జమ చేశామన్నారు. వీటిని గైడెన్స్ ప్రకారం వినియోగించుకోవాలన్నారు. ఆయనతో ఏఎంవో సుదర్శనమూర్తి, ఏఎస్‌వో నవీన్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు యాదగిరి, ఓం ప్రకాశ్, బుచ్చిరెడ్డి, ఏఈ రవిమోహన్, పంచాయతీ సెక్రెటరీ రేణుక, వీవో గాదె కవిత, ఎంఐఎస్ ఆంజనేయులు, సీఆర్‌పీ మొగులయ్య పాల్గొన్నారు.

## బగలాముఖి శక్తిపీఠాన్ని దర్శించుకున్న బీబీపాటిల్



శివ్వంపేటలో బగలాముఖి శక్తిపీఠాన్ని దర్శించుకుంటున్న బీబీపాటిల్ దంపతులు, తదితరులు

శివ్వంపేట, మే 15: శివ్వంపేటలో వెలిసిన బగలాముఖి శక్తిపీఠాన్ని బీజేపీ జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బీబీపాటిల్, అరుణ పాటిల్ దంపతులు బుధవారం దర్శించుకున్నారు. ప్రధాన అర్చకుడు సంతోష్‌శర్మ అమ్మవారి చరిత్రను వారికి వివరించి, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం శక్తిపీఠం స్థలదాతలు పబ్బ రమేశ్‌గుప్తా సన్మానించారు. వారితో బీజేపీ మండలాధ్యక్షుడు పెద్దపులి రవి, తిరుపతిరెడ్డి, ప్రసాద్ ట్రస్టు సభ్యులు సూర్యం కుమార్‌గౌడ్, బల్కంపేట భాస్కర్, నారాయణగారి వినోద్ కుమార్, చరణ్, ముద్దగల్ల లక్ష్మీనర్సయ్య, కొండల్, భర్మస్వామి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ బాసంపల్లి శ్రీధర్ గౌడ్, ముద్దగల్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.

# హెల్త్ కేర్ ఆవిష్కరణలకు సీడీఎఫ్డీ వేదిక

- సీడీఎఫ్‌డీ ఇంక్యుబేటర్‌లో పెరుగుతున్న హెల్త్‌కేర్ స్టార్టప్‌లు
- వైద్య రంగానికి అవసరమైన ఆవిష్కరణలకు ప్రోత్సాహం

సిటీబ్యూరో, మే 15(నమస్తే తెలంగాణ): డీఎన్‌ఏ పరిశోధనల్లో కీలకపాత్ర పోషిస్తున్న సెంటర్ ఫర్ డీఎన్‌ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్ సంస్థ ఇప్పుడు ఆవిష్కరణలకు వేదికగా మారుతున్నది. ఎన్నో అంతుచిక్కని, తరతరాలుగా పట్టి పీడిస్తున్న వ్యాధులకు పరిష్కారం కనుగొనే కేంద్రంగా నిలుస్తోంది. వినూత్న ఆవిష్కరణలతో యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నది. ఇప్పటికే అంతర్జాతీయ స్థాయి వైద్య విధానాలతో హెల్త్ హబ్‌గా నిలిచిన హైదరాబాద్..కరోనా తర్వాత వినూత్న ఆవిష్కరణలతో హెల్త్‌కేర్ స్టార్టప్‌లకు ప్రధాన కేంద్రంగా రూపాంతరం చెందుతున్నది. ఈ క్రమంలో అంతుచిక్కని ఎన్నో వ్యాధులకు పరిష్కారాలను అందించేలా సీడీఎఫ్‌డీ ఇంక్యుబేటర్ ప్రత్యేక పాత్రను పోషిస్తున్నది. స్టార్టప్ ఏకో సిస్టంతో, వినూత్నమైన ఆలోచనలకు కార్యరూపాన్ని తీసుకురావడంలో సీడీఎఫ్‌డీ– ఇంక్యుబేటర్ స్టేట్ ఆఫ్ ద ఆర్ట్ సౌకర్యాలను అందిస్తున్నది. ఔత్సాహికవేత్తలకు అవసరమైన మార్గదర్శకాలతోపాటు ఫండింగ్, నెట్‌వర్కింగ్ సదుపాయాలను కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నది. ఇటీవల కాలంలో హెల్త్ కేర్ రంగంలో స్టార్టప్‌లను నెలకొల్పే యువ పారిశ్రామికవేత్తలను ఆకర్షించేలా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తోంది. ఆలోచనలకు ఆచరణాత్మక రూపాన్ని అందించే సంస్థలను ప్రోత్సహిస్తూ హెల్త్ కేర్ స్టార్టప్‌లకు సీడీఎఫ్‌డీ ఇంక్యుబేటర్ ఎదుగుతున్నది.

### లైఫ్ సైన్సెస్ ఆవిష్కరణలకు వేదిక..

లైఫ్ సైన్సెస్ రంగంలో ఆవిష్కరణలకు అత్యంత డిమాండ్ ఏర్పడింది. ముఖ్యంగా పెరుగుతున్న వైద్య, ఆరోగ్య అవసరాల దృష్ట్యా, విస్తరిస్తున్న వ్యాధుల నియంత్రణలో హెల్త్ స్టార్టప్‌లకు క్రమంగా ప్రాధాన్యత పెరుగుతున్నది. అందుకే సమాజంలో ఎదురవుతున్న ఎన్నో వైద్య సంబంధిత సమస్యలకు పరిష్కారాలను అందించే ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్నట్లుగా సీడీఎఫ్డీ డైరెక్టర్ ప్రొ. ఉల్లాస్ కొల్తూర్ అన్నారు. భావి ఇన్నోవేటర్లకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లుగా తెలిపారు. స్వయం ప్రతిపత్తి కలిగిన ఈ సంస్థ ఇంక్యుబేటర్‌లో ఇప్పటికే స్టార్టప్‌లూ అందుబాటులోకి వస్తూనే ఉన్నాయి. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా మానవ వనరులు, నిపుణులతో స్టార్టప్ ఏకో సిస్టంను విస్తరిస్తున్నారు. సీడీఎఫ్డీ అందిస్తున్న ప్రోత్సాహంతో ఏఐ ఆధారిత టర్న్‌ఇట్, యూటోపియా థెరాపాటిక్స్ వంటి స్టార్టప్‌లూ కార్యకలాపాలను మొదలుపెట్టాయి.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
సిద్దిపేట/గజ్వేల్/తూప్రాన్/మెదక్ : 80966 77663
సంగారెడ్డి/జహీరాబాద్/నారాయణఖేడ్ : 9182777658
పటాన్‌చెరు : 80966 77657